క్లుప్తంగా

అయోడిన్ లోపంతో అనర్థాలు



మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్

చొప్పదండి: అయోడిన్ లోపంతో థైరాక్సిన్ హార్మోన్ విడదల తగ్గడంతో పిల్లల్లో జ్ఞాపకశక్తి, గ్రహణశక్తి లోపించడం, శారీరక, మానసిక ఎదుగుదల సమస్యలు తలెత్తుతాయయని ఎంఈవో దీక్షితుల శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రాజెక్టులో భాగంగా ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో అయోడిన్ లోపంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమతుల ఆహారం ప్రాధాన్యత వివరించారు. అనంతరం పిల్లలకు క్విజ్ పోటీలు నిర్వహించి సంస్థ తరుపున బహుమతులు ప్రాదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, మిట్టపల్లి నవీన్, అర్చన, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్ష



రిలే దీక్షలో భూ నిర్వాసితులు

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి గ్రామంలో భూ నిర్వాసితుల రిలే నిరాహార దీక్ష గురువారంతో రెండో రోజుకు చేరుకుంది. డిమాండ్లు నెరవేర్చే వరకు దీక్షలు విరమించమన్నారు. సుమారు 7.5 ఎకరాల భూమి కాల్వల తవ్వకం కింద కోల్పోతున్నామని 31 మంది భూ నిర్వాసితులు ఆరోపించారు.

కళాకారులకు సన్మానం



కళాకారులను సన్మానిస్తున్న నాయకులు

హుజూరాబాద్: ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న హుజూరాబాద్ ప్రాంతానికి చెందిన కళాకారులను ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ప్రాంత ఖ్యాతిని దేశవ్యాప్తం చేశారని అభినందించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రుద్రారపు రామచంద్రం, రాష్ట్ర నాయకులు మారెపల్లి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు తునికి వసంత్, జిల్లా అధికార ప్రతినిధి తుంగ అంజనేయులు, ఇమ్మడి శ్రీధర్, సాంస్కృతిక కళాకారులు పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు తీర్చాలని ఆందోళన

మానకొండూర్: గన్నేరువరం మండలం మైలారం గ్రామంలో తాగునీటి సమస్యను తీర్చాలని కోరుతూ గ్రామస్తులు శుద్ధజల ప్లాంట్ వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. గ్రామంలో రెండు శుద్ధజల ప్లాంట్లు ఉన్నప్పటికీ ఏ ఒక్కటి పనిచేయడం లేదని ఎస్సీకాలనీ, పక్కనే ఉన్న సాంబయ్య పల్లె గ్రామస్తులు వాటర్ ప్లాంట్ ల నుంచి మంచినీటిని తీసుకువెళ్లంటారని, ప్లాంట్లు పనిచేయకపోవడంతో తాగునీటికి తీవ్ర ఇబ్బంది ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీటి కోసం సమీప గ్రామాలకు వెళ్లాల్సి వస్తుందని అధికారులు తక్షణం స్పందించి ప్లాంట్లకు మరమ్మతు చేయించి నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న నాయకులు

మానకొండూర్: గన్నేరువరం మండలం చొక్కాలపల్లిలో చొక్కల్ల బాలయ్యకు సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు గురువారం కాంగ్రెస్ నాయకులు గురువారం చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నాగపురి శంకర్, న్యాలపట్ల కనకయ్య, దొమ్మాటి మల్లేశం, తాళ్లపల్లి శ్రీనివాస్, అనుమండ్ల నర్సయ్య, సుదగోని మల్లేశం, కోరివి తిరుపతి, రాజు పాల్గొన్నారు.

చంద్రయ్య మృతికి సంతాపం

హుజూరాబాద్: చిడతల రామాయణం గురువు మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన శ్రీపాద చంద్రయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. గురువారం చంద్రయ్య కుటుంబ సభ్యులను శిష్యులు పరామర్శించారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో బహుమతులు అందుకున్నారని గుర్తుచేసుకున్నారు. మృతిపై పట్టణశాఖ అధ్యక్షుడు మేకల తిరుపతి, బీజేపీ సీనియర్ నాయకుడు మోతి తిరుపతి, వివిధ పార్టీల నాయకులు, సీనియర్ కళాకారులు, సంతాపం వ్యక్తం చేశారు.

నిర్వహణ లోపం.. నిరుపయోగం

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న పల్లె ప్రకృతి వనాలు
- పంచాయతీలకు భారంగా మారుతున్న వైనం
- అధికారుల పర్యవేక్షణ కరువు



రాజాపల్లి గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో చెత్తాచెదారం

హుజూరాబాద్: గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆహ్లాదం అందించడానికి గత ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసింది. అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి గ్రామాల్లో ఎకరం నుంచి పదెకరాల స్థలంలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. వీటి ఏర్పాటుకు పంచాయతీ నిధులతోపాటు ఉపాధిహామీ పథకాన్ని వినియోగించుకున్నా నిరుపయోగంగా ఉంటున్నాయి. మొక్కలు నాటడం, గుంతలు తవ్వకం, నాటిన మొక్కల నిర్వహణ కోసం ఉపాధిహామీ పథకంలో పనులు చేపట్టారు. నేల చదును, అవసరం ఉన్నచోట మట్టి పోయడం, పంచాయతీ నర్సరీలోని మొక్కలు కాకుండా ఆ హ్లాదం పంచడానికి కావాల్సిన మొక్కల కొనుగోలుకు పంచాయతీల నిధులు కేటాయించారు. ఒక్కో పల్లె ప్రకృతి వనం నిర్మాణానికి రూ. రెండు నుంచి రూ.ఐదులక్షల వరకు ఖర్చు చేశారు. పెద్ద మొత్తంలో ఖర్చు చేసినా నిర్వహణ గాలికొదిలేశారు.

పంచాయతీలపై భారం

పల్లె ప్రకృతి వనాల నిర్వహణ గ్రామ పంచాయతీలకు భారంగా మారింది. మూడేళ్ల కింద నిర్మాణ సమయంలో రెండేళ్లపాటు ఉపాధిహామీ కూలీలతో నిర్వహణ చేపట్టారు. ప్రస్తుతం ఉపాధిహామీ నుంచి నిధులు కేటాయించడం లేదు. పల్లె ప్రకృతి వనంలో కలుపు తీయడంతోపాటు మొక్కల సంరక్షణ, నీటి నిర్వహణ వంటి పనులకు ప్రతినెల రూ.ఐదు వేల నుంచి రూ.ఆరువేల వరకు ఖర్చు అవుతుంది. నిర్వహణకు ప్రభుత్వం ఎటువంటి నిధులు కేటాయించకపోవడంతో పంచాయతీ నిధులతో నిర్వహణ గ్రామాలకు భారంగా మారింది.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల్లో ఆహ్లాదం లభించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వనాలను కొన్నిచోట్ల గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయడంతో ఆహ్లాదం పక్కన పెడితే పల్లె ప్రకృతి వనాలను చేరుకోవడానికి ఆయాసం వస్తుందని పలువురు వాపోతున్నారు. మరికొన్ని చోట్ల కొండలు, గుట్టల మధ్య, చెరువులు, శ్మశాన వాటికల పక్కన పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేయడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. పేకాట, మద్యం, దావతులకు నిలయంగా మారుతున్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

పల్లె ప్రకృతి వనాల నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు. మొక్కలు ఎండిపోకుండా సమయానికి అనుగుణంగా నీరు పట్టాలని ఆదేశాలు జారీ చేశాం. ప్రకృతి వనంలో నాటిన ప్రతి మొక్కను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. – తూర్పాటి సునీత, ఎంపీడీవో, హుజూరాబాద్

నులిపురుగుల నిర్మూలనతో ఆరోగ్యం



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు



మాట్లాడుతున్న వైద్యాధికారి మధు

జమ్మికుంట: నులిపురుగుల నిర్మూలనతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు అన్నారు. పట్టణంలోని కేవీకేలో గురువారం వావిలాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నిర్మూలనపై ప్రభుత్వ, ప్రైవేటు, పాఠశాలు ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాల అధ్యాపకులు, గ్రామీణ, పట్టణ ఐసీడీఎస్ అంగన్‌వాడీ టీచర్స్‌కు అవగాహన కల్పించారు. నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహారం లోపం, తరుచూ కడుపునొప్పితో ఇబ్బందులు ఏర్పడుతాయని నివారణకు సంబంధించిన జాగ్రత్తలు వివరించారు. కలుషిత ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఒకటి నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు ఈనెల 10వ తేదీన వేయించాలని, అందరి సహకారంతో కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో హేమలత, ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లు, డాక్టర్ చందన, హెల్త్ ఎడ్యుకేటర్స్ ప్రతాప్, మోహన్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్స్ అరుణ, రత్నకుమారి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హుజూరాబాద్: పాఠశాలల్లోని విద్యార్థులందరికీ అల్బెండజోల్ మాత్రలు అందజేయాలని చెల్పూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మధు అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. 10వ తేదీన మాత్రలు వేసుకోని పిల్లలకు 17వ తేదీన వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంఈఓ భూపతి శ్రీనివాస్, హెచ్ఈవో విజేందర్‌రెడ్డి, సూపర్‌వైజర్ రవి, హెల్త్ అసిస్టెంట్ సత్యం తదితరులు పాల్గొన్నారు

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి



రామడుగు: మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేశ్వరి



గంగాధర: మాట్లాడుతున్న ఎంపీవో జనార్దన్‌రెడ్డి

రామడుగు: క్షయ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో రాజేశ్వరీ అన్నారు. రామడుగులోని ఎంపీడీవో సమావేశ మందిరంలో గురువారం ప్రభుత్వం చేపట్టిన టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమం ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్టు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రవణ్‌కుమార్, ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్టు స్టేట్ టీడ్ ప్రభాకర్, ట్రెనింగ్ మేనేజర్ సురేందర్‌రెడ్డి, ప్రభాకర్ పలువురు పాల్గొన్నారు.

గంగాధర: టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఇంపాక్ట్ ఇండియా రాష్ట్ర అధికారి పురుషోత్తం కోరారు. టీబీముక్త్ అభియాన్‌లో భాగంగా గురువారం ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీవో జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రతి గ్రామంలో క్షయవ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. టీబీ రహిత జిల్లాకు జిల్లా క్షయ నివారణ విభాగం, జనరల్ హెల్త్‌స్టాఫ్‌తో కలిసి కొత్త కేసులను గుర్తించడంతో పాటు క్షయ బాధితుల ట్రీట్‌మెంట్ సక్సెస్ రేట్ పెంచడానికి కృషి చేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామసభలు, ఎస్‌హెచ్‌జీ, ఎన్‌జీవోలు, సీబీవోలు, స్టాండింగ్ కమిటీలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఇంపాక్ట్ ఇండియా ప్రాజక్టు జిల్లా అధికారి ప్రభాకర్, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక



తిమ్మాపూర్: మండల కేంద్రంలోని జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు సాధించారు. నలుగురు ప్రభుత్వ రంగ సంస్థల్లో, ఏడుగురు ఇన్ఫోసిస్ సంస్థలోని ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సివిల్ బ్రాంచ్‌కి చెందిన ఎం.రఘు జేటీవోగా (పంచాయత్‌రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్), శ్రీకాంత్ అసిస్టెంట్ ఇంజినీర్‌గా (ఐఎండ్‌కాడ్), సంగీత జేటీవోగా (పంచాయతీరాజ్), మయూరి అసిస్టెంట్ ఇంజినీర్‌గా(మిషన్ భగీరథ) ఉద్యోగాలు సాధించారు. సీఎస్ఈ బ్రాంచ్‌కి చెందిన ఏడుగురు విద్యార్థులు సంవత్సరానికి రూ.3.6 లక్షల ప్యాకేజీతో టాస్క్ ద్వారా ఇన్ఫోసిస్ కంపెనీలో సిస్టమ్ ఇంజినీర్‌గా ఉద్యోగాలు పొందారు. ఇన్ఫోసిస్ కంపెనీ యాజమాన్యం నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలో ఉత్తీర్ణత పొంది, టెక్నికల్, హెచ్‌ఆర్ రౌండ్‌లో ప్రతిభ కనపరచిన శ్రియ మద, మనస్విని పెద్ది, శ్రీజ సైని, ప్రీతి ఎడ్ల, జుఫిషాన్ ఖుర్షీద్, విశాఖ సోనీ, శివానీ బైరెడ్డి ఇన్ఫోసిస్‌లో సిస్టం ఇంజినీర్లుగా ఉద్యోగాలు సాధించారు. జ్యోతిష్మతి కళాశాలలో సీఎస్ చివరి సంవత్సరం చదువుతున్నారు. కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు మాట్లాడుతూ... విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఎంపికవ్వడంపై విద్యార్థులను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. సెక్రెటరీ, కరస్పాండెంట్ జె.సుమిత్‌సాయి మాట్లాడుతూ... కళాశాలలో విద్యార్థులకు అకాడమిక్ విద్యతో పాటు సాంకేతిక అంశాలపై శిక్షణ ఇవ్వడం, కార్పొరేట్ సంస్థలలో ఉద్యోగాలు పొందడానికి కావాల్సిన మెళకువలు నేర్పించడంపై దృష్టి సారించినట్లు తెలిపారు. విద్యార్థులు ఒరవడిని భవిష్యత్‌లో కొనసాగించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ అనిల్ కుమార్, డీన్ అకాడమిక్ వైశాలి విద్యార్థులను అభినందించారు.

మహిళా కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న సుగుణరెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్: జిల్లాలో మహిళా కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుగుణరెడ్డి అన్నారు. గురువారం ఇందిరాభవన్‌లో జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మహిళా కాంగ్రెస్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నగర, పట్టణ కమిటీలను సభ్యత్వం ఆధారంగా నియమించడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి విజయానికి పాటుపడాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని తెలిపారు.

నియామకం

మానకొండూర్: ఉమెన్ ఫిషరీస్ ప్రొడ్యూస్ లిమిటెడ్ కంపెనీ కరీంనగర్ చైర్మన్‌గా చిగురుమామిడి మండలంకు చెందిన పోలుస్వప్న శ్రీనివాస్ ముదిరాజ్ ఏగ్రగీవంగా ఎన్నికయ్యారు. మానకొండూరు మార్కెట్ యార్డ్‌లో కంపెనీ ఆధ్వర్యంలో జనరల్ బాడీ మీటింగ్ జరిగింది. కార్యక్రమంలో ప్రకృతి పర్యావరణ సంస్థ వ్యవస్థాపకుడు మూగ జయశ్రీ, ప్రకృతి పర్యావరణ రాష్ట్ర అధ్యక్షుడు మాధవరావు, రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ మాజీ చైర్మన్ పిట్టల రవీందర్, కంపెనీ సీఈవో చార్లెస్, కంపెనీ ఇన్‌చార్జి రాచూరి అరుణాదేవి, పప్పు సమ్మయ్య జిల్లా ఫిషరీస్ డైరెక్టర్, కూనచుల మహేందర్, ఫిషరీస్ అధ్యక్షులు శ్రీనివాస్ కులకాని మహేష్ గాడచర్ల శ్రీనివాస్, రాజమౌళి, రామాంజనేయులు గట్టు శ్రీధర్, రజిత పాల్గొన్నారు.

మాల మహానాడు గొల్లపల్లి కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

తిమ్మాపూర్: మాల మహానాడు గొల్లపల్లి నూతన కార్యవర్గం ఎన్నికలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఎలుక రాజు, ప్రధాన కార్యదర్శి కర్ర మణికంఠ ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా కర్ర శంకర్, ప్రధాన కార్యదర్శిగా దేవరాజు ఉపాధ్యక్షుడిగా తుంగ రాజు, కోశాధికారిగా చెవుల మల్లేశ్, గౌరవ అధ్యక్షుడిగా కర్ర కొమురయ్య, ముఖ్య సలహాదారులుగా కర్ర శ్రీనివాస్, ఎర్రోళ్ల రాజయ్య కర్ర శ్రవణ్, సోషల్ మీడియాగా రాహుల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రమేశ్, సుధాకర్, భాస్కర్, ఆశయ్య, పోచయ్య, రాజు భూమయ్య, రవి, నర్సయ్య, ప్రేమ్, రవి, వెంకటయ్య, శివయ్య, శేఖర్, కనకయ్య, రాజయ్య, రత్నయ్య, నవీన్, విజయ్, శివసాయి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఖరి వ్యక్తపరచాలి



మాట్లాడుతున్న జక్కని సంజయ్‌కుమార్

హుజూరాబాద్: రాష్ట్రంలో కులగణన సర్వే సరిగ్గా జరగలేదని బీసీ ఆజాదీ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ అన్నారు. గురువారం పట్టణంలో మాట్లాడారు. కులగణనలో బీసీ, ఎస్సీ, ఎస్టీల జనాభా తగ్గి ఓసీ జనాభా మాత్రం పెరగడం ఏంటో అర్థం కావడం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం మాత్రమే రిజర్వేషన్‌ను ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతుందని, రిజర్వేషన్లపై ప్రభుత్వంస్పష్టమైన వైఖరి వ్యక్తపరచాలన్నారు. సమావేశంలలో రాష్ట్ర అధికార ప్రతినిధి ఇప్పకాయల సాగర్, జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అశోక్‌కుమార్‌కు కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ మద్దతు



మాట్లాడుతున్న శ్రీధర్‌కుమార్

కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల టీచర్ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న వై.అశోక్ కుమార్‌కు తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్‌కుమార్ తెలిపారు. గురువారం శాతవాహన విశ్వవిద్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అశోక్‌కుమార్ ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యల కోసం గతంలో అనునిత్యం పోరాడిన వ్యక్తి అన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అర్జున్, జోసెఫ్, నరసింహ చారి, విజ యకుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



చొప్పదండి: పట్టణం నుంచి తొగరిమామిడికుంటకు వెళ్లే దారిలో వ్యవసాయ మార్కెట్ దాటగానే డీ 86 కాలువపై నిర్మించిన బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. రెయిలింగ్ ధ్వంసమై ఏళ్లు గడుస్తున్నాయి. కొత్త బ్రిడ్జి నిర్మించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
నాగరాజు, చొప్పదండి, మున్సిపల్ కమిషనర్, సెల్‌నం: 9949267882

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ఆధ్యాత్మికం

ఘనంగా శ్రీసుదర్శన హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు



పారాయణం నిర్వహిస్తున్న పండితులు

జమ్మికుంట: పట్టణంలోని శ్రీభగవద్గీత జ్ఞాన మందిరం సేవా సంఘం వార్షికోత్సవం పురస్కరించుకొని గురువారం శ్రీసుదర్శన నరసింహహవన హోమం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు మరిగంటి సంతోషాచారి, నిఖిలాచారి, రఘునందనాచారి, వెంకటాచార్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా, వేద మంత్రోచ్చరణల మధ్య అంగరంగా వైభవంగా నిర్వహించారు. భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించి హోమంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తిశ్రద్ధలతో తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి దేవాలయంలో గురువారం రాత్రి సాయమారాధన, నివేదన, ద్రావిడ ప్రభంద పారాయణం, విన్నపాలు, శాత్తుమురై, పరమపదోత్సవం, తీర్థగోష్ఠి కార్యక్రమాలు అర్చకులు ఘనంగా నిర్వహించారు.

పంటసాగుపై డిజిటల్ సర్వే



ఆముదాలపల్లెలో సర్వే చేస్తున్న ఏడీఏ శ్రీధర్

శంకరపట్నం: మండలంలోని ఆముదాలపల్లి గ్రామంలో గురువారం వ్యవసాయశాఖ అధికారులు పంటల సాగు డిజిటల్ సర్వే చేశారు. సర్వే నంబర్ల వారీగా పంటల సర్వే చేయాలని ఏడీఏ శ్రీధర్ సూచించారు. కార్యక్రమంలో ఏవో వెంకటేశ్, ఏఈవోలు పాల్గొన్నారు.

డప్పులు పంపిణీ



డప్పులు అందజేస్తున్న సాయిరి దేవయ్య

మానకొండూర్: మండలంలోని చెంజర్ల, ముంజంపల్లి, మానకొండూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు గురువారం డప్పులు పంపిణీ చేశారు. మాదిగ సంక్షేమ సంఘానికి మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాయిరి దేవయ్య, మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, కానిగంటి మల్లికార్జున్, వంగల మధుసూదనాచారి, శ్రీనివాస్ నాయకులు డప్పులు అందజేశారు.

వైభవంగా ప్రతిష్ఠాపనోత్సవాలు

కరీంనగర్‌రూరల్: దుర్శేడ్‌లోని బంగారు పోచమ్మ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా గురువారం వేదపండితులు శ్రీరాంభట్ల కార్తీక్ శర్మ ఆధ్వర్యంలో దేవరాజ్, ప్రశాంత్‌శర్మ, మధుసూధనచార్యులు జలాధివాసంలోని విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కోరుకంటి వేణుమాధవరావు, సింగిల్‌విండో చైర్మన్ తోట తిరుపతి, డైరెక్టర్ అంజయ్య, మాజీ ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, కమిటీ సభ్యులు తిరుపతి, రాంచంద్రం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామంలో గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఇప్పలపల్లి గ్రామానికి చెందిన వెంగళ శ్రీనివాస్ వ్యక్తిగత పనుల మీద బైక్‌పై కేశవపట్నం వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్తుండగా కుక్క అడ్డురావడంతో అదుపు తప్పి రోడ్డుపై పడడంతో కాలు విరిగింది. స్థానికులు 108లో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మద్యం పట్టివేత

జమ్మికుంట: అక్రమంగా విక్రయిస్తున్న మద్యం స్వాధీనం చేసుకొని కేసునమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి గురువారం తెలిపారు. మండలంలోని గోవిందాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి సుమారు రూ.ఆరువేలు విలువ చేసే మద్యం సీజ్ చేశామన్నారు.

తీన్మార్ మల్లన్నపై రెడ్డి సంఘం నేతల ఫిర్యాదు

తిమ్మాపూర్: ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నపై తిమ్మాపూర్ మండలం రెడ్డి సంఘం ప్రతినిధులు ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. రెడ్డి కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మల్లన్నపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ వివేక్‌ని కోరారు. రెడ్డి కులస్తులపై చులకనగా మాట్లాడటం, కులాల పేరుతో దూషణ చేయడం, కులాల మధ్య చిచ్చు పెట్టడం, ప్రజలను రెచ్చగొడుతున్నాడని వివరించారు. ఫిర్యాదు చేసిన వారిలో రెడ్డి సంఘం ప్రతినిధులు సింగిరెడ్డి భాస్కర్ రెడ్డి, కేతిరెడ్డి అంజిరెడ్డి, రామిడి మల్లారెడ్డి, పాశం అశోక్ రెడ్డి, మధుకర్ రెడ్డి, పాపిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

శంకరపట్నం: మండలంలోని రాజాపూర్ గ్రామంలో ఇటీవల మృతిచెందినవారి కుటుంబాలను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం పరామర్శించారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. వెంట మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బస్వయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ తిరపతి, బండారి తిరుపతి తదితరులున్నారు.